

డెల్టాలకు 5,730 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 1,590, మధ్య డెల్టాకు 1,140, పశ్చిమ డెల్టాకు 3,000 క్యూసెక్కులు విడుదల చేశారు.



సత్యదేవుని దేవేరికి వజ్రకిరీటం

రత్నగిరిపై కొలువైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీ దేవి అమ్మవారు త్వరలో వజ్రకిరీటాలంకరణలో భక్తులను అనుగ్రహించనున్నారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
34.0°/25.5°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	32.0	25.5
కాకినాడ	30.0	26.9
అమలాపురం	34.0	26.0

న్యూస్‌రీల్

పది సప్లిమెంటరీ ఫలితాల్లో 44.69 శాతం ఉత్తీర్ణత

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాలో ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 44.69 ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఆ వివరాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు బాలురు 4,632 మంది, బాలికలు 3,419 మంది హాజరయ్యారు. వీరిలో బాలురు 2,070 మంది, బాలికలు 1,825 మంది, మొత్తం 3,895 మంది విద్యార్థులు **పాసయ్యారు. 44** కేంద్రాల్లో ఈనెల 2 నుంచి **10వ తేదీ వరకు ఈ** పరీక్షలు నిర్వహించారు.

1,283 మందికి బంగారుకొండ కిట్లు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన బంగారుకొండ కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయడంలో తొలి అడుగులు వేశామని కలెక్టర్ మాధవీలత అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, ఆడిట్ అధికారులతో కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్ దినేషకుమార్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లాలో బలహీనంగా, వయసుకు తగిన బరువు, ఎత్తు లేని 1,283 మంది పిల్లలను గుర్తించి వారికి బాలమిత్రల ద్వారా బంగారు కొండ కిట్లను పంపిణీ చేశామన్నారు. ఈ మేరకు బాలమిత్రల భాగస్వామ్యం , చొరవను ప్రత్యేకంగా అభినందించారు. తొలి వారం క్షేత్ర స్థాయిలో బాలమిత్రలు దత్తత తీసుకున్న చిన్నారుల ఇంటికి వెళ్లి అవగాహన కల్పించామన్నారు. మొత్తం ఆరు నెలల పాటు బాలమిత్ర ఆయా గృహాలను సందర్శించాలన్నారు. ప్రతి నెలా జిల్లాలో బలహీనంగా ఉన్న పిల్లలను గుర్తించే ప్రక్రియ కొనసాగిస్తామన్నారు. బంగారుకొండ కింద బాలమిత్రలుగా రూ.3 వేలు చెల్లించిన వారి పేరుతో ధ్రువీకరణ పత్రం అందజేస్తామన్నారు. ప్రతి బుధవారం బాలమిత్రలు చిన్నారుల ఇంటి సందర్శనకు వెళ్లే క్రమంలో ముందురోజు ఆ సమాచారాన్ని చిన్నారుల తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో జిల్లా స్త్రీ, శిశుసంక్షేమ అధికారి కె.విజయ కుమారి, డీఆర్‌డీఏ పీడీ ఎస్.సుభాషిణి, డీఈవో ఎస్.అబ్రహం, డీఎస్‌వో ఎ.కుమార్, జిల్లా ఆడిట్ అధికారి సరస్వతి పాల్గొన్నారు.

జెడ్పీలో 12 మందికి పదోన్నతి

కాకినాడ సిటీ: జిల్లా ప్రజాపరిషత్ యాజమాన్యం పరిధిలో 12 మంది ఉద్యోగులకు పరిపాలనాధికారులుగా ప్రమోషన్ ఇస్తూ జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం జెడ్పీ కార్యాలయంలోని చైర్మన్ ఛాంబర్‌లో ఉద్యోగులకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ప్రమోషన్ పొందినవారిలో 11 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఒక వీడీవో గ్రేడ్-1 ఉన్నారు. ఆ ఉద్యోగులను జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి అభినందించారు. త్వరితగతిన పదోన్నతులు కల్పించడంపై ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీవీ రమేష్, పదోన్నతులు పొందిన ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.



శరవేగంగా సాగుతున్న రహదారి ఫుట్‌పాత్ పనులు

రూ.9.30 కోట్లతో స్మార్ట్‌రోడ్

రాజమహేంద్రవరంలో 'వై జంక్షన్–లాలాచెరువు' రహదారికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఆర్ట్స్ కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, కేంద్ర గిడ్డంగులు, ఫారెస్ట్ ఆఫీస్, సెంట్రల్ జైల్ లాంటి ప్రధాన ప్రభుత్వ భవనాలకు కేరాఫ్ ఇది. వివిధ పనులపై వచ్చే పాదచారులు ఎక్కువగా సంచరించే ప్రదేశం కూడా ఇదే. అలాంటి రహదారిని ఇటు ప్రజలకు, అటు ప్రయాణికులకు అనువైన దారిగా అభివృద్ధి చేసేందుకు నగరపాలక సంస్థ అడుగులు వేస్తోంది. 'జగనన్న స్మార్ట్ రోడ్' పేరుతో రూ.9.30 కోట్ల వ్యయంతో పనులకు శ్రీకారం చుట్టింది. 'వై జంక్షన్ నుంచి లాలాచెరువు జంక్షన్' వరకు 3.00 కిలో మీటర్ల మేర అధునాత రహదారిని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తోంది. **పనులు ప్రారంభమయ్యాయి.**



ఇక స్మార్ట్‌గా.. హ్యాపీగా..

- రాజమహేంద్రవరంలో రహదారులకు మహర్దశ
- నడుం బిగించిన నగర పాలక సంస్థ అధికారులు
- జగనన్న స్మార్ట్ రోడ్స్‌పేరుతో అభివృద్ధికి ప్రణాళికలు
- రూ.9.30 కోట్లతో సుందరీకరణ, వసతుల కల్పన

సాక్షి, రాజమహేంద్రవరం: జిల్లా కేంద్రం రాజమహేంద్రవరం నగర అభివృద్ధి, సుందరీకరణకు ప్రభుత్వం, నగర పాలక సంస్థ విశేషంగా కృషి చేస్తున్నాయి. నగర పాలక సంస్థ ఇప్పటి వరకు ప్రజలకు ఆహ్లాదం, ఆనందాన్ని పంచేందుకు, ఒత్తిడిని అధిగమించేందుకు పార్కుల సుందరీకరణకు నాంది పలికింది. పుష్కరప్లాజా, హ్యాపీ స్ట్రీట్ లాంటి ప్రదేశాలను అందుబాటులోకి తెచ్చింది. సాయంత్రం వేళ కుటుంబ సభ్యులతో సరదాగా గడిపేందుకు, వివిధ రకాల రుచికరమైన ఆహారం ఒకే చోట లభించేలా ఈట్‌స్ట్రీట్‌ను సైతం ఏర్పాటు చేసింది. తాజాగా మరో బృహత్తర ప్రణాళికను అమలు చేస్తోంది. రహదారుల రూపురేఖలు మార్చేందుకు సిద్ధమైంది. అనుకున్నదే తడవుగా టెండర్ల ప్రక్రియ **పూర్తి చేసి పనులు ప్రారంభించింది. త్వరితగతిన పూర్తి చేసేందుకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.**

దారికొస్తున్నాయ్..

రాజమహేంద్రవరం చారిత్రక నగరం. హోల్‌సేల్ వస్త్ర వ్యాపారానికి పెట్టింది పేరు. వస్త్రాల కొనుగోలుకు ఇతర జిల్లాల నుంచి వస్తుంటారు. విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ వంటి ప్రధాన నగరాలను అనుసంధానించే నగరం. ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన వారు విదేశాలకు ఇక్కడి మధురపూడి ఎయిర్‌పోర్ట్ నుంచే వెళ్లాల్సి ఉంది. ప్రాధాన్యత సంతరించుకున్న నగరంలో అంతర్గత, ప్రధాన రహదారులు ఇరుకుగా ఉండటం, నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొనేవారు. ఫుట్‌పాత్ లేకపోవడంతో రోడ్డుపై అడ్డదిడ్డంగా వెళ్లాల్సిన దుస్థితి. ఈ పరిస్థితిని రూపుమాపేందుకు నగరపాలక సంస్థ అధికారులు కసరత్తు ప్రారంభించారు. వాహనాలు ఎక్కువగా ప్రయాణించే రహదారుల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నారు.

8 అంశాలతో ప్రత్యేకం

- జగనన్న స్మార్ట్ రోడ్ నిర్మాణంలో 8 అంశాలను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఆహ్లాదాన్ని పంచుతూనే ప్రయాణం సాఫీగా సాగేలా రోడ్లు రూపుదిద్దుకోనున్నాయి. మహానగరాలైన విశాఖ, విజయవాడలతో పోటీగా పనులు చేపడుతున్నారు.
- ప్రస్తుతం రహదారికి ఇరువైపులా ఇన్ 9, అవుట్ 9 మీటర్ల రోడ్డుగా విభజించారు.
- రోడ్డుకు ఇరువైపులా 2–5 మీటర్ల ప్రదేశంలో పాదచారులకు ఫుట్‌పాత్ అందుబాటులోకి తెస్తున్నారు. మధ్యలో ఆహ్లాదాన్ని నింపేలా గడ్డి ఏర్పాటు చేస్తున్నారు. యవత ఆనందంగా గడిపేందుకు అక్కడక్కడ సెల్ఫీ స్లాట్లు అందుబాటులోకి తెస్తున్నారు. గోడలపై రంగు రంగుల బొమ్మలు దర్శనమిస్తున్నాయి.



రహదారి డిజైన్



ప్రజలకు కూర్చునేందుకు నిర్మిస్తున్న సిమెంట్ దిమ్మెలు

నయా ట్రెండ్ సైకిల్ ట్రాక్



"రాజమహేంద్రవరంలో లో 'జగనన్న స్మార్ట్ రోడ్' పనులను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. రూ.9.30 కోట్లతో మహానగరాలకు తీసిపోని విధంగా నిర్మాణం చేపడున్నాం. వాహన రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా పాదచారులు నడిచేలా ఏర్పాట్లు చేశాం. చిరు వ్యాపారులకు స్థలం కేటాయిస్తున్నాం. ఇంత వరకు నగరంలోని నయా ట్రెండ్ సైకిల్ ట్రాక్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నాం . సైక్లింగ్ చేసే వారికి ఇది ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుంది. గ్రీనరీని అభివృద్ధి చేసి హరితనగరంగా తీర్చిదిద్దాలన్న తలంపుతో కష్టపడుతున్నాం."

– కె. దినేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

- మరో 3 మీటర్ల స్థలంలో చిరు వ్యాపారాలు చేసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రశాంత వాతావరణంలో కాసేపు కూర్చునేందుకు సిమెంటు దిమ్మెల నిర్మాణం చేపడుతున్నారు.
- పట్టణ శోభ ఉట్టిపడేలా ఆధునాతన వీధి దీపాలు అమర్చారు. ప్రధాన రహదారి కావడంతో పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా పార్కింగ్ స్థలం ప్రత్యేకంగా కేటాయించారు.
- 1.5 మీటర్ల ప్రదేశం ఇరువైపులా సైక్లింగ్ కేటాయించారు. ఇందుకుగాను ప్రత్యేకంగా సైకిల్ ట్రాక్ అందుబాటులోకి తెస్తున్నారు.
- 1 మీటర్ విస్తీర్ణంలో రోడ్డుకు మధ్యలో డివైడర్ తీసుకువస్తున్నారు. డివైడర్‌లో పచ్చదనాన్ని పెంపొందించేలా రకరకాల మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

అర్హులకు లబ్ధి చేకూర్చేందుకే జగనన్న సురక్ష

- నేటి నుంచి ఈనెల 30 వరకూ ఇంటింటి సర్వే
- జూలై ఒకటి నుంచి 23 వరకూ గ్రామసభలు
- హోంమంత్రి తానేటి వనిత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందలేని అర్హులను గుర్తించి, వారికి లబ్ధి చేకూర్చడానికే జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని రాష్ట్ర హోంమంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. సీఎం జగన్ ప్రారంభోత్సవాన్ని కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అనంతరం మంత్రి వనిత మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చి, దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పేదల ఇళ్ల తలుపు తట్టి సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. స్పందన ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం కోసం అడుగులు వేసి, మరింత జవాబుదారీతనం కోసం జగనన్నకు చెబుదాం కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే 99 శాతం మందికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నా, మిగిలి ఉన్న ఒక శాతం వారి కోసం ఆలోచన చేస్తున్న జగనన్నకు ప్రజలు పెద్ద ఎత్తున అభినందనలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే ద్వైవార్షిక విధానంలో మిగిలిపోయిన అర్హులకు జూలై, డిసెంబర్ నెలల్లో గుర్తించి ప్రయోజనం కల్పిస్తున్నట్లు తెలిపారు.

పూర్తిస్థాయి అవగాహన



సమావేశంలో పాల్గొన్న హోంమంత్రి వనిత, కలెక్టర్ మాధవీలత, కమిషనర్ దినేష్ కుమార్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి

కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జగనన్న సురక్షపై జిల్లా వ్యాప్తంగా ఉన్న 3,937 సచివాలయ కార్యద ర్శులు, 8,933 మంది వలంటీర్లకు ఇప్పటికే మండల పరిధిలో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో అవగాహన కల్పించామన్నారు. వలంటీర్లు శనివారం నుంచి ఈనెల 30 వరకూ ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న సురక్ష కింద డేటా ఎంట్రీ చేసి, అర్హత ఉన్న లబ్ధిదారులను గుర్తిస్తారన్నారు. స్పందన, జగనన్నకు చెబుదాం కింద వచ్చిన అర్జీలను సంఘటితం చేసి ఇంకా పరిష్కారం కాని వాటిని జగనన్న సురక్ష కింద చేపట్టడం జరుగుతుందన్నారు. జూలై ఒకటి నుంచి 23 వరకూ గ్రామస్థాయిలో జగనన్న సురక్ష గ్రామసభలను ప్రత్యామ్నాయ రోజులలో నిర్వహించడం కోసం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఇంటింటి సర్వే ద్వారా వచ్చిన అర్జీలను పరిశీలించి, గ్రామ సభల్లో ధ్రువపత్రాలు అందచేస్తామన్నారు. జిల్లాలో జగనన్నకు చెబుదాం 1902 ద్వారా వచ్చిన 2,500 సమస్యలను నిర్దిష్ట సమయంలో పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, నగరపాక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి పి.వీణాదేవి, వి.శాంతమణి పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించిన 25 వేల మంది భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని శుక్రవారం 25 వేల మంది భక్తులు దర్శించి పూజలు చేశారు. సత్యదేవుని వ్రతాలు 1,500 జరిగాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షలు ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు.

ఘనంగా సత్యదేవుని జన్మనక్షత్ర పూజలు

రత్నగిరి వాసుడు సత్యదేవుని జన్మ నక్షత్రం 'మఖ' సందర్భంగా శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పండితులు తెల్లవారుజామున రెండు గంటలకు ఆలయం తెరిచి ప్రత్యేక పూజలు చేశారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుల మూలవిరాట్‌లకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారు, శంకరులను నూతన పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు సత్యదేవునికి యాగశాలలో ఆయుష్య హోమం నిర్వహించారు. వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, చిట్టెం శివ, యనమండ్ర శర్మ, ఇంద్రగంటి నర్సింహమూర్తి, తదితరులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

రూ.20 లక్షలతో మహా నివేదనశాల

అన్నవరం: రత్నగిరిపై వీరవేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయ సమీపంలో మహా నివేదన శాల నూతన భవనం నిర్మాణానికి తునికి చెందిన పారిశ్రామికవేత్త చక్కా సూర్యనారాయ ణ మూర్తి దంపతులు ముందుకు వచ్చారు. రూ. 20 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించి దేవస్థానానికి అప్పగించేందుకు వారు సంసిద్ధత వ్యక్తం చేసిన ట్టు దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. దాతలు ముందుకు వచ్చి దేవస్థానంలో వివిధ నిర్మాణాలకు తమ వంతు సహాయసహకారాలు అందజేయాలని ఆయన కోరారు.



సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

మట్టి పరీక్ష.. భూమికి రక్ష

- అధిక దిగుబడుల సాధనకు అవకాశం
- భూసారాన్ని బట్టి సాగు నిర్ణయం
- 70శాతం మట్టి నమునాల సేకరణ

కొవ్వూరు: నేల స్వభావం, భూసారంపైనే పంట దిగుబడి ఆధారపడుతుంది. అధిక మోతాదులో రసాయన ఎరువు వాడడం, పంటల మార్పిడి చేయకపోవడం ద్వారా భూములు నిస్సారమవుతున్నాయి. భూసార పరిరక్షణ పద్ధతులు పాటించక పోవడంతో దిగుబడులు తగ్గుతున్నాయి. అందుకే భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఈ పరీక్షలకు శ్రీకారం చుట్టారు. మట్టి నమునాలు సేకరిస్తున్నారు. రాజమహేంద్రవరం ఏఎంసీ కార్యాలయం ప్రాంగణంలోని భూసార పరీక్ష కేంద్రంలో వీటిని పరీక్షించి నివేదికలు అందిస్తారు. ఈ సీజన్‌లో వివిధ ప్రాంతాల నుంచి 11,039 మట్టి నమునాలు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటికే 7,307 నమునాలు సేకరించారు.

ఇవీ ప్రయోజనాలు


- మట్టి నమునాల పరీక్షతో పోషక పదార్థాల పరిమాణం లెక్క కడతారు.
- పొలంలో పోషక పదార్థాల స్థాయిని(సత్తువను) తెలుసుకోవచ్చు.
- కారి,చౌడు, ఆమ్ల భూముల స్థాయిని నిర్ధారించి భూసారాన్ని మెరుగుకు సరైన పద్ధతులు సిఫార్సు చేస్తారు.
- ఏయే ఎరువులు, ఏ మోతాదులో, ఏ రూపంలో,ఎప్పుడు వేయాలో సూచిస్తారు.
- ఏయే పంటలకు నేల అనుకూలమో తెలియజేస్తారు.
- సిఫార్సులకు అనుగుణంగా ఎరువులు వాడితే సాగు ఖర్చు తగ్గుతుంది.

ఈ జాగ్రత్తలు అవసరం

నేల స్వభావాన్ని బట్టి పైరు పంటలకు ఆరు అంగుళాలు, పండ్ల తోటలకు 5–6 అగుడులు,కారి,చౌడు,ఆమ్ల నేలలకు మూడు అడుగులు లోతు నుంచి మట్టి సేకరి ంచాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. ఎరువు వేసిన పొలాలు,పెంట కుప్పలు వేసిన స్థలాలు, గట్లు,చెట్లకు, బావులకు, రహదారులకు దగ్గరగా మట్టి నమునాలు సేకరించకూడదు. మాగాణి నేలల్లో నీరు పెట్టక ముందే నమునా సేకరించాలి. పంట విత్తే ముందు గానీ, పైరు కోసిన తర్వాత గానీ మట్టి నమునాలు సేకరించాలి.



ఒకసారి చేస్తే మూడు సీజన్లకు ఓకే



పశువుల పెంట, కంపోస్టు, పచ్చి రొట్ట ఎరువులు వాడడం ద్వారా భూ సారాన్ని కాపాడుకోవచ్చు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 40 శాతం మట్టి నమునాలు సేకరించాం. ఒకసారి మట్టి పరీక్ష చేయించుకుంటే మూడు పంట కాలాలకు ఆ నివేదికలు ఉపకరిస్తాయి. భూసార పరీక్షలు వేగవంతం చేసేందుకు అదనపు సిబ్బందిని నియామించాం. నెలాఖరు నాటికి శాంపిల్స్ సేకరణ పూర్తవుతుంది.

– ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

మట్టి నమునా సేకరణ ఇలా....

పేరు	రైతులు	లక్ష్యం	సేకరణ
రాజానగరం	9,885	782	252
కొవ్వూరు	10,551	596	421
బిక్కవోలు	7,068	835	402
దేవరపల్లి	9,277	559	363
రంగంపేట	9,961	734	392
కోరుకొండ	9,961	788	490
గోకవరం	9,632	762	452
నల్లజర్ల	9,232	731	540
కడియం	6,347	502	335
నిడదవోలు	10,245	811	489
గోపాలపురం	7,399	586	359
పెరవలి	8,312	658	614
అనపర్తి	7,389	585	385
రాజమహేంద్రవరం	1,768	140	81
చాగల్లు	7,914	626	486
ఉండ్రాజవరం	6,783	537	496
తాళ్లపూడి	4,473	354	310
సీతానగరం	5,723	453	440
మొత్తం	1,39,496	11,039	7,307

క్లుప్తంగా

ఇసుక లారీ ఢీకొని మహిళ దుర్మరణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సురేష్

పెద్దాపురం: ఇసుక లారీ బలంగా ఢీకొనడంతో ఓ మహిళ దుర్మరణం పాలైంది. మండలంలోని దివిలి గ్రామానికి చెందిన గంటా సూర్యాకాంతం (54) భర్త లక్ష్మీపతి సమీపంలోని సుబ్బారాయుడుపేటలో ఉన్న ఓ కోళ్లఫారం వద్ద పని చేస్తున్నాడు. అతడికి సూర్యాకాంతం శుక్రవారం మధ్యాహ్నం భోజనం తీసుకువెళ్లి, తిరిగి వస్తోంది. స్థానిక రజకపేట సమీపానికి వచ్చేసరికి అప్పుడే ఇసుకను డంప్ చేసి తిరి వేగంగా వెళ్తున్న లారీ ఆమెను వెనుక నుంచి బలంగా ఢీకొంది. సుమారు 100 మీటర్ల మేర ఆమెను లాక్కుని పోయింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయమవడంతో సూర్యాకాంతం అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై వెలుగుల సురేష్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం అనంతరం లారీ డ్రైవర్ పరారయ్యాడు. ఆ లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతురాలు సూర్యాకాంతానికి భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పారిపోయిన అక్కచెల్లెళ్లు.. కుటుంబ సభ్యుల చెంతకు..

తుని: ఇంటి నుంచి పారిపోయిన అక్కచెల్లెళ్లను పట్టుకొని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు స్థానిక ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్‌పీ) ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం రూరల్ కొంతమూరుకు చెందిన అక్క (16), చెల్లెలు (14) ఇంటి నుంచి పారిపోయి వచ్చి, అన్నవరం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. వారిని హెడ్ కానిస్టేబుల్ ఎన్.శ్యామ్‌త్రినాథరావు పట్టుకుని తుని జీఆర్‌పీ ఎస్సై మారూఫ్‌కు అప్పగించారు. తమ తల్లి కొన్నాళ్లుగా కువైట్‌లో ఉంటోందని, తండ్రి సయ్యద్ కలీషా పట్టించుకోవడం లేదని, అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నామని వారు పోలీసులకు చెప్పారు. అమ్మమ్మ పెట్టే బాధలు తాళలేక ఇంటి నుంచి పారిపోయి వచ్చామని తెలిపారు. దీంతో పోలీసులు వారి తండ్రి, అమ్మమ్మను తుని జీఆర్‌పీ స్టేషన్‌కు పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చి అక్కచెల్లెళ్లను వారికి అప్పగించారు.

నాణ్యమైన విత్తనం.. నమ్మకమైన దిగుబడి

పాడి-పంట



- ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్న రైతులు
- విత్తనాల ఎంపికే కీలకమంటున్న వ్యవసాయాధికారులు
- అందుబాటులో నాణ్యమైన రకాలు



బి.బోసుబాబు, జిల్లా వ్యవసాయాధికారి



కొత్తపేట: ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులకు విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరి. విత్తనాల కొనుగోలులో అప్రమత్తంగా లేకపోతే కొంత మంది వ్యాపారులు నాణ్యత లేని విత్తనాలు అంటగట్టే అవకాశం ఉంటుంది. రైతులు నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధించాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యం. ఈ నేపథ్యంలో వారు నకిలీలతో మోసపోకుండా రైతుభరోసా కేంద్రాల(ఆర్‌బీకే)కు ఇప్పటికే నాణ్యమైన విత్తనాలు సరఫరా చేసింది. సాగులో విత్తనాల ఎంపికే కీలకమని, దీంతో పాటు కొనుగోలు సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు **డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యవసాయ అధికారి బి.బోసుబాబు** సూచిస్తున్నారు.

నాణ్యతను గుర్తించాలిలా..

- విత్తనాలు బ్రీడర్ ఫౌండేషన్ సర్టిఫైడ్ ట్రూత్‌ఫుల్ లేబుల్స్‌లో లభిస్తాయి. వీటిని సాగు చేసి, మళ్లీ విత్తనాలుగా వినియోగించుకోవచ్చు. దీనివలన రైతులకు విత్తన భారం తగ్గుతుంది.
- బ్రీడర్ విత్తనాన్ని విత్తన పరిశోధన స్థానాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, విత్తన కంపెనీల శాస్త్రవేత్తల పర్యవేక్షణలో ఉత్పత్తి చేస్తారు. బ్రీడర్ సీడ్‌కు బంగారు రంగు ట్యాగ్ ఉంటుంది. ఈ విత్తనాల ధర కాస్త ఎక్కువ. దుకాణాల్లో విరివిగా లభ్యం కావు.
- బ్రీడర్ సీడ్ నుంచి ఫౌండేషన్ సీడ్ ఉత్పత్తి చేస్తారు. సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో వివిధ విత్తన ఉత్పత్తి సంస్థలు వీటిని పండిస్తాయి. ఫౌండేషన్ విత్తనానికి తెలుపు రంగు ట్యాగ్ ఉంటుంది.
- ఫౌండేషన్ సీడ్ నుంచి వచ్చే విత్తనాన్ని సర్టిఫైడ్ సీడ్ అంటారు. దీనికి నీలం రంగు ట్యాగ్ వేస్తారు.
- సర్టిఫైడ్ సీడ్ నుంచి వచ్చే విత్తనాన్ని ట్రూత్‌ఫుల్ సీడ్‌గా వ్యవహరించి, దీనికి ఆకుపచ్చ ట్యాగ్ వేస్తారు.

ఆయా జిల్లాల్లో వరి సాగు విస్తీర్ణం (ఎకరాల్లో..)

జిల్లా పేరు	విస్తీర్ణం
తూర్పు గోదావరి	1,94,642
కాకినాడ	2,27,000
కోనసీమ	1,83,000

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

- వ్యవసాయ శాఖ వద్ద అనుమతి పొందిన అ. దీకృత డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- కొనుగోలు సమయంలో తీసుకున్న బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకూ జాగ్రత్తగా భద్రపరచుకోవాలి.
- బిల్లుపై విక్రయదారు పేరు, రాష్ట్ర అమ్మకం పన్ను నంబర్, నికర తూకం, నికర ధర, లాట్ నంబర్, విత్తన రకం, గడువు తేదీ, కంపెనీ పేరు, డీలర్ సంతకం ఉండేలా చూసుకోవాలి.
- ఎట్టి పరిస్థితుల్లోనూ లూజు (విడి), గడువు దాటిన విత్తనాలు కొనుగోలు చేయరాదు.
- కొనుగోలు చేసిన వెంటనే విత్తనాలను పరీక్షించి మొలక శాతం పరిశీలించాలి.
- మొలకెత్తే సమయం, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ అధికారిని సంప్రదించాలి.

నకిలీల కట్టడికి ప్రభుత్వం చర్యలు

నకిలీ విత్తనాల విక్రయంపై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. నకిలీ విత్తనాలు విక్రయిస్తూ, రైతులను మోసం చేసే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని కలెక్టర్లు, వ్యవసాయ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. నాణ్యత లేని, నకిలీ విత్తనాలను అరికట్టడంలో భాగంగా ప్రభుత్వమే ఆర్‌బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు సరఫరా చేస్తోంది. ధర తక్కువని ప్రైవేటు వ్యక్తుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి మోసపోకుండా రైతుల్లో అవగాహన పెంచుతోంది.

స్వర్ణకు ప్రత్యామ్నాయంగా కర్షక మిత్ర

ఖరీఫ్‌లో ఎంటీయూ-7029 (స్వర్ణ), ఎంటీయూ-1064 (అమర), ఎంటీయూ-1061 (ఇంద్ర), ఎస్‌ఎల్‌ఆర్-34449 (నెల్లూరు సన్నాలు), ఆర్‌జీఎల్-2537 (రాగోలు సన్నాలు), బీపీటీ-5204 (సాంబ మసూరి) రకాలు సాగు చేయాలని రైతులకు వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రైతులు 80 శాతం స్వర్ణ రకం సాగు చేస్తున్నారు. అయితే ఇది అధిక వర్షాలు, తుపాన్లకు పడిపోతూండటంతో రైతులు నష్టపోతున్నారు. అందువలన దీని స్థానంలో మార్టేరు వరి పరిశోధన స్థానం విడుదల చేసిన ఎంటీయూ-1318 (కర్షక మిత్ర) రకంపై రైతులు మక్కువ చూపిస్తున్నారు. దీనిని వారు ×పడిపోని స్వర్ణ×గా కూడా పిలుస్తున్నారు. ఇది వర్షాలు, తుపాన్లకు కూడా తట్టుకుని నిలబడి అధిక దిగుబడి ఇస్తోంది.

పట్టుదలతో విజయం సాధ్యం

- 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు
- గోదావరి క్లస్టర్ క్రీడా పోటీలు ప్రారంభం



బాస్కెట్‌బాల్‌తో పోటీలను ప్రారంభించిన వీసీ పద్మరాజు

రాజానగరం: పట్టుదలగా సాధన చేస్తే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కె.పద్మరాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్య ప్లానింగ్ బోర్డు ఆదేశాలతో అంతర్ విశ్వవిద్యాలయాల రీజినల్ గోదావరి క్లస్టర్ క్రీడలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్సిటీలో క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. గోదావరి క్లస్టర్‌లో నన్నయతో పాటు, జేఎన్‌టీయూకే, వైఎస్సార్ హార్టికల్చర్, ఎన్‌ఐటీ ఉన్నాయని, ఈ నాలుగు రంగాల విద్యార్థులు కలసి, ఒకేచోట క్రీడా పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. క్రీడలైనా, ఐఏఎస్, ఐపీఎస్ అయినా పట్టుదల అనే పెట్టుబడి ఉంటే సాధించవచ్చని చెప్పారు. క్రీడల కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ రమణేశ్వరి మాట్లాడుతూ, నాలుగు వర్సిటీల నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. తొలుత క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించి, ఉపకులపతికి గౌరవ వందనం సమర్పించారు. క్రీడల కార్యదర్శి డాక్టర్ రాంగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ టి.అశోక్, వర్సిటీ ఆచార్యులు, అధికారులు, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధిని అర్థం చేసుకోవాలి



సదస్సులో పాల్గొన్న అతిథులు, ఆదిత్య సిబ్బంది

గండేపల్లి: పరిశోధనలతో సుస్థిర అభివృద్ధిని అర్థం చేసుకోవాలని టీసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు ఎంజీపీఎల్ నారాయణ, హైదరాబాద్‌కు చెందిన ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ కె.శివకుమార్ యువతకు సూచించారు. సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో ఆదిత్య కళాశాల ఐఈఈఈ విశాఖ బే సెక్షన్‌తో కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్న అడ్వాన్స్‌డ్ గ్లోబల్ ఇంజినీరింగ్ చాలెంజ్(ఏజీఈసీ)పై అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న నారాయణ, శివకుమార్ మాట్లాడుతూ, సుస్థిర అభివృద్ధి ఔషధం వంటిదని నానో, రోబో, టెక్నో మొబైల్ అప్లికేషన్, వివిధ రకాల సాంకేతికతలను సాధించాలని అన్నారు. విద్యుత్ కాలుష్యాన్ని అరికట్టాలన్నారు. కొత్త ఆవిష్కరణలపై దృష్టి సారించాలని, సాంకేతికత మెరుగు పడుతూండటంతో పరిశోధనల తీరు రోజురోజుకూ మారుతోందని, యువత ఆ దిశగా అడుగులు వేయాలని చెప్పారు. ఆదిత్య కళాశాలల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డోలా సంజయ్, ఆదిరెడ్డి రమేష్, డీన్లు ఎస్.రమాశ్రీ, కేవీఎస్ఆర్ మూర్తి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



ఆకట్టుకున్న శ్రీనివాస కల్యాణం జానపద నృత్యరూపకం

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): కళా సమ్మేళనం-2023లో భాగంగా రెండో రోజైన శుక్రవారం జాతీయ స్థాయి సంగీత, నృత్య పోటీలు ఉత్సాహంగా జరిగాయి. నగరపాలక సంస్థ, శ్రీరాధాకృష్ణ ట్రస్టు, శ్రీరాధాకృష్ణ కళాక్షేత్రం ఆధ్వర్యానశ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాత్రి శ్రీనివాస కల్యాణం నృత్య రూపకం ప్రదర్శించారు. స్వామి వారికి ఒకవైపు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం జరుగుతూండగా.. అందుకు తగినట్టుగా అన్నమయ్య గీతాలు, జానపదాలకు కళాకారులు అద్భుతమైన శాస్త్రీయ, జానపద నృత్యాలతో వీక్షకులను ఆశ్చర్యపరిచారు. శ్రీనివాస కల్యాణంలో పసుపు కొమ్ములు దంచిన దగ్గర నుంచి.. ఎదురు సన్నాహం.. ఇతర కల్యాణ తంతులతో పాటు శ్రీనివాస కల్యాణం చూతము రారండి అంటూ చివరన మంగళహారతి ఇచ్చేంత వరకూ అన్ని ఘట్టాలనూ కళ్లకు కట్టినట్టు అభినయించారు. మనదైన సంప్రదాయ వివాహ వ్యవస్థపై మక్కువ పెంచే విధంగా శ్రీనివాస కల్యాణం కమనీయంగా నిర్వహించామని కార్యక్రమం నిర్వాహకుడు జీబీ నారాయణ తెలిపారు. అంతకు ముందు ఉదయం 5 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 128 మంది కళాకారులు శాస్త్రీయ నృత్య, సంగీత పోటీల్లో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పి.సత్యవేణి పాల్గొన్నారు. కళాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. విజేతల వివరాలను చివరి రోజైన ఆదివారం ప్రకటిస్తారు. న్యాయ నిర్ణేతలుగా గోరుగంతు ఉమా జయశ్రీ, పోతిన శ్రీనివాస్, కుశల్ భట్టాచార్య తదితరులు వ్యవహరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సామర్లకోట: రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి (30) మృతదేహం లభ్యమైంది. రైల్వే ఎస్సై బి.లోవరాజు కథనం ప్రకారం.. సామర్లకోట - పిఠాపురం రైల్వే లైనులో సామర్లకోట స్టేషన్ నుంచి విశాఖపట్నం శుక్రవారం వెళ్తున్న 12841 రైలుకు అడ్డంగా ఒక వ్యక్తి వచ్చాడు. ఆ రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై లోకోపైలట్ ఎస్‌కేజే హుస్సేన్ స్టేషన్ మాస్టర్ దీపక్ రాజ్‌కు ఫిర్యాదు చేశాడు. మృతదేహం గుర్తు పట్టలేని విధంగా ఛిద్రమైపోయింది. మృతుడు తెలుపు రంగు షార్ట్, ఎరుపు, నలుపు చారల రౌండ్ నెక్ టీ షర్టు ధరించాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం వివరాలకు రైల్వే పోలీసు స్టేషన్‌ను 93988 50428 నంబర్‌లో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

నేడు ఎంటీఎస్ టీచర్లకు బదిలీ కౌన్సెలింగ్

రాయవరం/బాలాజీచెరువు (కాకినాడ సిటీ): అవిభక్త తూర్పు గోదావరి జిల్లాలో పని చేస్తున్న 2008 డీఎస్సీ, 1998 మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి కేఎన్‌వీఎస్ అన్నపూర్ణ శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. సమగ్ర శిక్షా సమావేశ హాలులో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే బదిలీ కౌన్సెలింగ్‌కు ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎంటీఎస్ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు హాజరు కావాలని ఆమె తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

కాకినాడ రూరల్: పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్న ఓ మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆ మహిళ తన ఆత్మహత్య యత్నానికి గల కారణాలను రికార్డు చేసి సోషల్ మీడియాలో పెట్టింది. ఇది శుక్రవారం వైరల్ అయ్యింది. సర్పవరం పోలీసుల కథనం ప్రకారం.. తునికి చెందిన జ్యోతి, ఆమె భర్త గుడారిగుంటలో మకాం ఉంటున్నారు. స్థానికంగా ఉన్న విష్ణు ఫిల్లింగ్ స్టేషన్‌లో ఆమె క్యాషియర్‌గా పని చేసేది. మూడు నెలల క్రితం బంక్‌లో సుమారు రూ.9 లక్షల వరకూ తేడా వచ్చింది. దీనిపై జ్యోతిని యజమాని నిలదీశారు. ఈ విషయంలో వారిద్దరి మధ్య వాగ్వాదం జరుగుతుంది. ఆ సొమ్ములు చెల్లించాలంటూ యజమాని తరఫు సిబ్బంది ఈ నెల 20న జ్యోతి ఇంటికి వెళ్లారు. అదే రోజున ఆమె చీమల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. బంక్ యజమాని వేధింపుల కారణంగానే తన కుమార్తె ఆత్మహత్యా యత్నానికి పాల్పడిందని తండ్రి ఉంద్రాజవరపు చంటి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బంక్ యజమాని విష్ణుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ మురళీకృష్ణ తెలిపారు.

సత్యదేవుని దేవేరికి వజ్రకిరీటం

- దాత వినతికి అన్నవరం దేవస్థానం అంగీకారం
- వివాహాలు, ఉపనయనాల బ్రాహ్మణుల సరఫరాకు టెండర్ కం వేలం
- రూ.7 కోట్లతో నమూనా ఆలయం, పెద్ద నిర్మాణ టెండర్లకు ఆమోదం
- శివసదన్‌లో రూ.3 కోట్లతో నిర్మాణాలు
- ధర్మకర్తల మండలి తీర్మానం



ధర్మకర్తల మండలి సమావేశంలో పాల్గొన్న చైర్మన్, ఈఓ, సభ్యులు

అన్నవరం: రత్నగిరిపై కొలువైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు త్వరలో వజ్రకిరీటాలంకరణలో భక్తులను అనుగ్రహించనున్నారు. రూ.కోటి పైగా వ్యయంతో అమ్మవారికి వజ్రకిరీటం చేయించేందుకు పెద్దాపురం శ్రీ లలితా రైస్ ఇండస్ట్రీ ఎండీ మట్టే సత్యప్రసాద్ చేసిన అభ్యర్థనకు అన్నవరం దేవస్థానం ధర్మకర్తల మండలి శుక్రవారం ఆమోదం తెలిపింది. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన ధర్మకర్తల మండలి సమావేశం శుక్రవారం జరిగింది. ఈఓ చంద్రశేఖర్ అజాద్, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ముఖ్య తీర్మానాలివీ..

- దాత మట్టే సత్యప్రసాద్ గత ఏడాది సత్యదేవునికి వజ్రకిరీటం సమర్పించారు. అదేవిధంగా అమ్మవారికి కూడా ఆరు నెలల్లోగా వజ్రకిరీటం చేయించేందుకు అనుమతించాల్సిందిగా లేఖ రాశారు. స్వామి, అమ్మవార్లకు ఏకకాలంలో వజ్రకిరీటాలు అలంకరించాలని కోరారు. ఆ కిరీటాలకు భద్రత కల్పించాలని కోరారు. దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ నిబంధనల మేరకు అమ్మవారి వజ్రకిరీటానికి అనుమతి ఇచ్చేందుకు ధర్మకర్తల మండలి సమావేశం తీర్మానం.
- దేవస్థానంలో వివాహాలు, ఉపనయనాలు తదితర శుభ కార్యాలకు నిర్ణీత రుసుములకు బ్రాహ్మణులను సరఫరాకు సింగిల్ విండో విధానం అమలుపై టెండర్ కం వేలం నిర్వహణ.
- తలనీలాలు పోగు చేసుకుని, తీసుకు వెళ్లేందుకు గత నెల 24న ఈ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిన నిర్వహించిన టెండర్‌లో హెచ్చు పాట రూ.1.35 కోట్లకు ఆమోదం.
- జాతీయ రహదారిపై సత్యదేవ డిగ్రీ కళాశాల వద్ద సత్యదేవుని నమూనా ఆలయం, ప్రసాదం కౌంటర్, ఫుడ్ కోర్టు తదితర నిర్మాణాలకు రూ.3.44 కోట్ల అంచనాతో ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ (రెండోసారి) పిలిచారు. దీనిపై రివర్స్ టెండర్, సంప్రదింపుల ద్వారా 3.95 శాతం హెచ్చుతో రూ.3.57 కోట్లకు డీవీ సుబ్బరాజు కొటేషన్ దాఖలు చేశారు. అదే తక్కువ కావడంతో పచ్చజెండా.
- దేవస్థానం జూనియర్ కళాశాల మైదానంలో భక్తులు సేద తీరేందుకు, వంటలు చేసుకునేందుకు, దేవస్థానంలో తూర్పు రాజగోపురానికి ఇరువైపులా గార్డెన్స్‌లో రూ.1.90 కోట్లతో తొమ్మిది షెడ్ల నిర్మాణానికి టెండర్ల ఆమోదం.
- సత్యగిరిపై రూ.15 కోట్లతో 138 గదులతో నిర్మిస్తున్న శివసదన్ సత్రం ముగింపు దశకు చేరింది. ఇందులో ఫ్లోరింగ్, ప్యానల్స్, గదులు, కిటికీలకు కర్టెన్ల వంటి వాటి ఏర్పాటు టెండర్లకు అనుమతి.
- శివసదన్ సత్రానికి రూ.87.75 లక్షలతో జనరేటర్ కొనుగోలుకు టెండర్ ఆమోదం.
- రూ.1.04 కోట్లతో లో టెన్షన్ ప్యానెల్స్ ఏర్పాటు టెండర్‌కు అనుమతి.
- రూ.39.75 లక్షలతో శివసదన్ సత్రం ఆవరణలో కాంక్రీట్ ఫ్లోరింగ్ చేయడానికి, రూ.19.50 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి, రూ.9.90 లక్షలతో కర్టెన్ల కొనుగోలు టెండర్లకు ఆమోదం.
- దేవస్థానంలో వివిధ అవసరాల నిమిత్తం మహేంద్ర కంపెనీ ఆథరైజ్డ్ డీలర్ నుంచి రెండు బొలేరో వాహనాల కొనుగోలుకు, విజయవాడకు చెందిన సంస్థ నుంచి రెండు ట్రాలీల కొనుగోలుకు అంగీకారం.
- దేవస్థానం బస్సు టికెట్ల రేట్లు స్వల్పంగా పెంచేందుకు ఆమోదం. రత్నగిరి నుంచి అన్నవరం రైల్వేస్టేషన్‌కు ప్రస్తుతం ఉన్న టికెట్ చార్జీ రూ.15 నుంచి రూ.20కి పెంపు. అలాగే కొండ దిగువ నుంచి రైల్వే స్టేషన్‌కు చార్జీని రూ.10 నుంచి రూ.15కు, కొండ మీద నుంచి దిగువకు రూ.5 నుంచి రూ.10కి పెంపు. తిరుగు ప్రయాణంలోనూ ఇవే రేట్లు వర్తింపు.

ఇది నా అదృష్టం



అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి వజ్రకిరీటం చేయించే అవకాశం దక్కడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. వివిధ కారణాలతో కొంత ఆలస్యమైనా ధర్మకర్తల మండలి సభ్యులు ఈ అవకాశం కల్పించడం చాలా సంతోషమనిపించింది. ఈ కిరీటం నాలుగు నెలల్లోనే చేయించి విజయదశమి నాటికి అమ్మవారికి అలంకరించేలా ప్రయత్నం చేస్తాను.

– దాత మట్టే సత్యప్రసాద్

సూక్ష్మ కుటీర పరిశ్రమల అభివృద్ధి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న చిరంజీవి చౌదరి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లాల్లో మరిన్ని సూక్ష్మ కుటీర పరిశ్రమల అభివృద్ధికి జిల్లా రీసోర్స్ పర్సన్లు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి అన్నారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి క్రమబద్ధీకరణ పథకం(పీఎంఎఫ్ఎంఈ)పై స్థానిక సీటీఆర్ఐ సెమినార్ హాలులో శుక్రవారం జరిగిన రీజినల్ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వ్యవసాయ అనుబంధ ప్రభుత్వ శాఖల సహకారంతో అభివృద్ధి పథకాలను రైతులు అంది పుచ్చుకొని ఆర్థికాభివృద్ధి చెందాలని అన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించామని చెప్పారు. గత ఏడాది 120 పరిశ్రమల స్థాపన లక్ష్యం కాగా, 211 స్థాపించామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం లక్ష్యాలను చేరుకొనే దిశగా నిర్దిష్ట కార్యాచరణ రూపొందించామని చిరంజీవి చౌదరి తెలిపారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈఓ కె.శ్రీధర్‌రెడ్డి, కోకోనట్ బోర్డ్ డిప్యూటీ డైరెక్టర్ కుమార్‌వేల్, నాబార్డ్ డీడీఎం సోమినాయుడు కూడా మాట్లాడారు. సూక్ష్మ ఆహార కుటీర పరిశ్రమలను విజయవంతంగా నిర్వహిస్తున్న హేమ పికిల్స్ హేమ (తూర్పు గోదావరి), శ్రీసాయి ఇడ్లీ దోశ పిండి మేకర్ శ్రీదేవి (కాకినాడ), శ్రీ ఫుడ్ ఫ్యాక్టరీ శ్రీదేవి (ఏలూరు జిల్లా నూజివీడు), జ్యూసీ హోమ్ ఫుడ్స్ రాఘవేంద్రరావు (అమలాపురం), సాయితేజ ఆయిల్ అండ్ ఫ్లోర్‌మిల్ (భీమవరం), డీఆర్‌పీలు రాజకిషోర్, శ్రీనివాస్, రమ్య, హిమవళి, యాదవ్‌లను చిరంజీవి చౌదరి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లాల ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఈడీలు, ఉద్యాన శాఖాధికారులు కె.స్వామి, బీవీ రమణ, ఎన్.మల్లికార్జునరావు, ఎ.దుర్గేష్, స్టేట్ లీడ్ మేనేజర్ కె.సుభాష్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.